# సంపాదకీయము

పూజ్య గురుదేవులు మహాత్మా శ్రీ రామచంద్రజీ మహారాజ్ (పూజ్య బాబూజీ) వారి ఆశీర్వచనములవలన వారి జన్మదినవేడుకలు మరల మనమందరము కలసి జరుపుకొను అవకాశము వచ్చినది. ఇది వారి 108వ జన్మదినవేడుక. ఈ శుభసందర్భములో అన్యమైన ఆలోచనలను వదలి వారు మార్పుచేయ సంకల్పించిన మానవ చైతన్య దివ్యకార్యములో మన కర్తవ్యమును మననము చేసుకొనుట సముచితము. వారు గృహస్థులు ఆచరింపదగిన రాజయోగమును దయతో మనకొసంగినారు. ఇంతవరకు రాజయోగము దానిలోని క్లిష్టమైన విధానములవలన కొద్దిమందికే పరిమితమైనది. దీనివలన ఆధ్యాత్మికముగా పురోగతికలుగునని నమ్మకమున్నను ఆచరించుటకు యిది గృహస్థులకు అనువుగానుండెడిది కాదు. అటువంటి విధానమును సులభతరము గావించి, ఆయన స్వీయ అనుభవముతో యింతవరకు ఎవ్వరునూ సోధించని అతి ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థితులకు దారి ఏర్పరచి, అందరూ ఆచరించదగిన శ్రీ రామచంద్ర రాజయోగ విధానమును మనకు అందించిన విశిష్టమూర్తిమత్వము.

ఈ విధానములో బాహ్య ఆడంబరములు లేని అంతర్గత పూజావిధానమైన ధ్యానమును ఆచరించెదము. పైగా పూజ్య బాబూజీ గారు తమ రచనలలో విగ్రహారాధన ఈ యోగవిధానములో పురోగమనమునకు ఆటంకము కలుగజేయునని చెప్పినారు.

అందువలన మన పద్ధతిలో బాహ్యమైన ఆడంబరములకు తావులేదు కనుక సాధారణమైన పూజలు చేయువారికి యిది పూజావిధానమే కాదనియు, నాస్తికమార్గమనియు, పైగా పాత సాంప్రదాయములు మరియు విలువలకు తిలోదకములిచ్చినామని అపోహపడుచుందురు. అట్టి సమయములలో కొంతమంది సాధకులకు ఒకింత అనుమానము పొడచూపు ఆస్కారమున్నది. అనుమానము పెనుభూతము. పూజ్య బాబూజీ గారు కూడా 'అనుమానము ఆధ్యాత్మిక ప్రగతికి విషతుల్యమని' సెలవిచ్చినారు. కావున అటువంటి అనుమాన నివృత్తి కొరకు మన సాధనా విధానములను ఒకసారి పరికించి చూచినప్పుడు యితరులు మన సాధనగురించి ఏర్పరచుకొనిన అభిప్రాయములు అపోహాలే యను వాస్తవము మనకు విదితమగును. సాధారణమైన పూజావిధానములన్నియు మతముయొక్క పరిధిలోనే పరిభ్రమించుచూ వాటినాచరించు వారికి యింద్రియ సంబంధమైన ఆనందమును కలుగజేయును. "మతము పరిధి అంతమైన ఆధ్యాత్మికత, ఆధ్యాత్మికత అంతమైన సత్‌తత్వము, సత్‌తత్వము అంతమైన అనంతానందము, అదికూడా అంతమైనపుడే గమ్యమునకు చేరువవుదుమని" పూజ్య బాబూజీ గారు సత్యోదయము (Dawn of Reality)లో చెప్పినారు. దీనిని అర్థము చేసుకొనినచో మనము ఆచరించు విధానము ఎంత ఉన్నతమైనదో మనకు బోధపడును. మన గురుదేవులు సంప్రదాయములన్నిటిని ఒకేచోట జేర్చి మనకు ప్రసాదించినవే దశాదేశములు. ఈ దశాదేశములు వారికి అత్యున్నతమైన ఆధ్యాత్మిక స్థితిలోనుండగా వచ్చినవి. "ఇవి యన్నియు ఆధ్యాత్మిక రహస్యములు. ఇవి యింతవరకు ఒకరినుండి ఒకరికి తెలుపబడిన సత్యములు. వీటిని ప్రకృతిని గమనించి దానినుండి వచ్చు ప్రతిస్పందనవలన గ్రహించవలయునే గాని అక్షర రూపములో వ్యక్తపరచుట బహు కష్టమైన విషయము. దానిలోని నిజమైన సారమును పాఠకులు గ్రహించి వారు

లబ్ధిపొందుటయే గాక యితరులు కూడ లబ్ధిపొందుటకు సహకరించవలెను." అని పూజ్య బాబూజీ గారు చెప్పినారు. అందువలన శ్రీ రామచంద్ర రాజయోగ సాధకులు ఎవ్వరూ మన సాంప్రదాయములను గాని, విలువలను గాని విస్మరించరు అనునది సత్యము. ఇంతియేగాక యింతవరకు వాటిని వల్లెవేయు విధానమును ప్రక్కనబెట్టి నిజజీవితములో అభ్యాసము చేసి వారి స్వీయ అనుభవములతో ఎవరికివారు తెలుసుకొను విధానములను మన గురుదేవులు మనకందించినారు. ఇంతటి ఉన్నతమైన విధానమును సామాన్యులమైన మనబోటివారికి లభించునట్లు చేయుట పూర్వజన్మ సుకృతమే. ఇంతకు పూర్వము సత్‌తత్వము నిమ్న స్థితులకు చెందినదై అది పొందినవారికే పరిమితమై యుండెడిది. అది యితరులకు ఏవిధముగనూ ఉపయోగపడలేదు. వారు పొందిన స్థితులను వారు మాత్రమే అనుభవించి దానిని తరువాతి తరములకు అందజేయు విధానములు కొరవడినవి. కానీ పూజ్య గురుదేవుల నూతన ఆధ్యాత్మిక శకము ఆరంభమైనది. ఈ పద్ధతిలో మృగప్రాయమైన చైతన్యములో చిక్కుకొనియున్న వ్యక్తి తన చైతన్యమునే గాక సమస్త మానవ చైతన్యము కూడ మార్పుచెందవలె నను సదుద్దేశ్యము కలిగియున్నప్పుడు మాత్రమే ఆ దివ్య చైతన్యమే ఆతని చైతన్యస్థితులను ఉన్నతదశలకు తీసుకొనిపోయి, యింతకు మునుపు కబీరువంటి మహాయోగులకు వారి జీవితకాలములో దుర్లభమైన కేంద్రస్థానముయొక్క ద్వారములుకూడ అందుబాటులోనికి తీసుకొని వచ్చిన సమర్థ సద్గురువర్యులు మన పూజ్య బాబూజీ మహారాజ్. వారికి మన వంతు కర్తవ్యముగా మన సాధనవలన కేంద్రస్థానమునకు అతి దగ్గరగా చేరుకొనుచూ దానియొక్క అనుభవమును యితరులతో పంచుకొని వారికి దాని అనుభవమును అందజేయుటకు నిరంతరము కృషిచేయుచు గురుదేవుల ఋణమును కొద్దిగానైనా తీర్చుకొను అవకాశమును మనకు కల్పించినారు. అత్యున్నతస్థితులకు చేరుకొనిన వారు, వారి ఆధ్యాత్మిక స్థితులను అర్హత కలిగిన యితర సాధకులకు అందజేయగల సామర్థ్యమును కలిగియుందురని పూజ్య బాబూజీ గారు చెప్పినారు. దీనిని తమ స్వానుభవముతో తెలుసుకొనుచున్న అనేకమంది సోదరులు మనలోనున్నారనునది మనందరికి తెలిసిన సత్యము. ఇక్కడ అర్హత అనునది మన సాధన, గురుదేవులపై మనకుగల భక్తి, శ్రద్ధ, అనురాగములపై ఆధారపడియుండును.

మనము ఈ భువి మీద మానవజన్మ ఎత్తినది నిజమైన మనీషిగా యెదుగుటకే యని మహాపురుషులు చెబుతూనేయున్నారు. అటుల ఎదుగు అవకాశము మన ముంగిటలోనేయున్నది. నిదురనుండి మేల్కొని మనకు పూజ్య గురుదేవులు ప్రసాదించిన అవకాశమును సద్వినియోగము చేసుకొనుటయే మన విజ్ఞత.

ఈ శుభసందర్భములో ప్రతిఒక్కరు సాధనావిధానములను అవగాహన చేసుకొని భక్తి, శ్రద్ధ, ప్రేమలతో వాటిని ఆచరించి, గురుదేవులపై అచంచల విశ్వాసమును పెంపొందించుకొని, వారి ఆశీర్వచనములు, తోడ్పాటుతో అత్యున్నత ఆధ్యాత్మిక స్థితిని పొందగలరని మా ప్రగాఢ విశ్వాసము.

**- వి. రామం**